# రాజసూయం

వాన కురిసి, యింకా బాగా తెరిపి కాలేదు...సన్నతుంపురు పడుతూనే ఉన్నది ఈదురు ముసిరి... ఎడాపెడా వెలిగే దీపాలు...మసకబారినవేమో, కదిలితే నీడబారుతూన్నది.

కారు, కదలికలోనే ధూకుడు చూపించింది. పదిబారలైనా సాగలేదు–పదునెక్కిన తారురోడ్...నీళ్ళు నిలిచిన గతుకులు...చీకట్లు–పొరజూడకుండా దాటిపోయి, కాలుజారి అడ్డంగా పడిపోయినాడు–ఎవడో– కాళ్ళమీదకు ఎడమవైపు చక్రాలు పోయినవి...

అక్కడికి–నలుగురూ పోగయినారు.

ఎవరో పాపం.

ఎవరైతే నేం.

కారులో ఎక్కేవాళ్ళకు కళ్ళు ఉండవూ?

ఇదివరకు ఎన్నైనాయో? – కండకావరం కాకపోతే–

అనవసర ప్రసంగాలు, అంతకన్న...ఆపదవచ్చిన వేళల అయినా, లోకం...ఎందుకు అక్కరకువస్తుంది.

పడిపోయినవాడు...తెప్పరిలుతున్నాడు., బాధ తెలుస్తూంది. ఎవరవని అడిగితే... ఏమని చెప్పగలడు–

ఆ యిద్దరూ ... జనాన్ని సర్దుకుంటూ ముందుకు వచ్చారు. అత్తరువువాసనా – ఆ వాసనా – అక్కడంతా ఘుమాయిస్తూన్నవి. ఆమె చొరవగా ముందుకు వెళ్ళింది. అతడు తూలుకుంటూ అడుగు వేసినచోటనే వేస్తున్నాడు. అవతలగా...చేత డైరీ...వేలుమడిచి పాయదీసి పట్టుకుని...ఏం వ్రాసుకునేందుకైనా తయారుగా కాన్‌స్టేబుల్ –

వాళ్ళిద్దరినీ చూసి...ఫాయాకు జంకి...చోద్యంచూడ పోగైన జనమంతా సైగలతో చూపులతో ప్రశ్నలూ – జవాబులు సరిపుచ్చుకున్నారు.

ఆ కారులో వాళ్ళు వీళ్ళేకాదూ? – అవును.

ఇంతకుముందు ఆ బారులోనుంచి...మరి...ఆహో! ఇవాళేం? – రోజూ ఇదేపని ఒళ్ళు తెలియకుండా ఒకరిమీద ఒకరు పడుతూ–

ఇదా వరుస? – కాకపోతే ఇంతకన్న ఏం వరుస? కనబడటం లేదూ? – రాటుదేరిన రఖం...వాడెవరో తేభ్యం...పిండేస్తూంది.

కండకావరం... మనకెందుకు ఎవరేలా...

అవును--

ఆమె ముందుకువంగి పరకాయించి చూసింది. అలా పడిఉన్న అబిసి...అ...లా...ఒత్తిగిలి... సొమ్మసిలి...కళ్ళు మూసుకున్నాడు.

అరెకుడు...అంతో యింతోగానో...ఆమె చెప్పినది నచ్చి, అక్కడ మూగినవారం దరినీ...ఇక కాలు సాగనీయమని...అక్కడనుంచి తప్పుకున్నాడు...పుస్తకం మూసేసి జేబులో పెట్టుకుంటూ--

ముందు కొంచెం సణగబోయి...ఆమె గద్దించేసరికి...పిల్లిలాగా--అతడు...అలా పడిపోయిన అతడిని తన చేతుల్లోకి అలాగ్గా తీసుకుని...పసిపాపనులాగా భద్రంగా కారులో వెనుక పరుండబెట్టినాడు-

ఇంకా...ఎవరిత్రోవను వారు పోకుండా...ఇందాకటి వారందరూ...అ చాటునా మాటునా... మళ్ళా మాట రాకుండా...నిలిచి ఏం జరుగుతుందో అని కనిపెట్టే ఉన్నారు...అతడు మోరాయించడం...ఆమె నోరుచేసుకు గదమాయించి...

పాపపు మాటలనుకున్నాం- చూడు...అ యిల్లాలు

ఇల్లాలు కాకపోతే మాత్రం...మనిషి కాదూ?

మరి, వాడూ ఓ మనిషేనా?-ఆడదానిపాటి చేయలేదూ... తాను చేసిందేగా...యీ నిర్వాహకం.

ఏంచూసి వలచింది...ఏమోలే, అదంతా మనకెందుకు? -- కులం చెడితేనేం...గుణం మిగలడంసరి-

మరీ ముసురై... దీపాలు చప్పున ఒక్కసారిగా కొండెక్కి ఊరుకున్నాయి. లైట్ హౌస్ మాత్రం వెలుగు...అందని ఎత్తునుంచి...అవతల దూరాలకు అర-మామగా త్రిప్పుతూన్నది. రోడ్డుమీద పిట్ట అయినా ఆడటంలేదు.

సమయానికి, యింజన్ జమ్ముకున్నది. ఎంతనొక్కినా త్రిప్పినా...గూడు పట్టుకుపోతూన్నది కాని, దానికి జవ పుట్టటంలేదు...

దమ్ముకట్టింది - నెట్టేందుకు ఆమెకూడా ఓ చేయి వేస్తే బాగుండిపోను...కాని అడిగేందుకు దమ్ము చాలడంలేదు:

ఆ బిచ్చగాడు ఎవరో...

ఎవరాతడు...ఎవరో...మన హాయాంకు పూర్వ పరిచయంతో...చిత్తయిపోయి చివరకు యీ స్థితికివచ్చిన బాపతా?-

అయితే మాత్రం...ఆ పరంపరలో చిదికిపోయిన ఘటాలన్నిటికీ...చికిత్సచేస్తూ కూర్చుండటానికి...తానేం త్రాడుకట్టిన మగడా...

వాడే ధన్యుడు - విడిచిందో...బ్రదికాడో-చేసుకుని చేతగాక దేశంమీద వదిలాడు...విరుచుకు తింటూన్నది... విడిచిపెడితే...

అది నాకు చేతకాదని తెలుసు...అందుకే యిన్ని ఆటలు-

కారులో మొదటనే ఆమె ఎక్కి కూర్చున్నది: ఎక్కడనో పుట్టి ఏ మూలకో మాయమయే వెలుగు, ఆమె పరాకున తల కదిలించినపుడల్లా చెవుల రవలకు ఒరసి...జిల్లున తళుకు కొడుతూన్నది: కారు సాగించఢానికి తంటాలుపడుతూ...చుట్టి

ప్రదక్షిణంగా పరిశీలించబోతూన్నప్పుడల్లా ఆ మెరుపు అతని చూపుకు తగిలి ...బెడిసి పోతూన్నది...

కంగారు అంతా అయినతరువాత, కారు కదిలింది: కదిలిక ఎక్కువ తగలకుండా నిదానంగా నడుపుతున్నాడు...వెనుకనుంచి శ్రుతిగా కమ్ముకున్న మూలుగు...అతని మనసులో అనేక రకాల ప్రశ్నలకు, చిలవలూ పలవలనూ...ఆమె వైఖరిలో అమిత నిర్లక్ష్యాన్ని... పెంచుతూంది.

కారు, రోడ్డుమెలివెంట తిరిగి గుమ్మంముందు నిలకడకు మసులుతూండేలోగానే, ఆమె దిగి, తలుపు తాళం తీసి లోపలికి వెళ్ళిపోయింది! అతడు, చక్రం మీదకు ఓ చేయిజాపి...మోపిన మరోచేయి సిగరెట్‌కు ఆసరాయిస్తూ...పొగలు గ్రక్కుతున్నాడు:

లోపల వెలుతురు అయింది: వెలుగును పాయదీసుకుంటూ ఆమె, తిరిగివచ్చి... చేరువలో మెట్లమీద నిలుచున్నది:

చూపులకు అందనీక...చూపులను తప్పించుకున్నా...బానిస పడిపోయిన అతని మనసు...ఆమె అక్కడ నిలుచుని, అనుకున్న ఆజ్ఞను...తలనుదాల్చి పాలించింది: అతడు చురుకుగా...పొదుపుగా...అతన్ని...లోపలికి.

...ఆమెకు వచ్చినచోట...అలాగా...ఉంచాడు...తెచ్చి ఆ నిమిషాన ... అందరికీ మౌనం: అంతలో అతని మూలుగు...దాన్ని తరచింది వివరించింది: అతడు ఓర్వలేక...అక్కడ నిలుచోలేకపోయినాడు: మూలుగు, వెక్కిరింతగా...వెనుకబడి తరిమింది.

అత...ను, ఆమె...మిగిలారు:

అదే, ఆమెకు చాలా...ఇరకాటం అనిపిస్తూంది:

అతను మూలుగు నిలిపి...ఆమె చూపును తనకు మళ్ళించుకున్నాడు: ఆమె వశం తప్పిపోతూ... ఆస్తీకుడు అడ్డుపడకముందు...అగ్నికుండంవేపు దూసుకునే పన్నగి...అంతకు మిన్నగా ఝుళుకుతూన్నది!

ఎవరు ముందు మాట్లాడేది? – ఏమని?

మాటలాడకపోతేనేం?...

లేకపోతే...మౌనం భరించడం...మరీ కష్టం.

తాను పలుకరించడం...ఏ మొగం పెట్టుకుని?... అతనికి అంత అపకారం చేసిన తరువాత ...అతని... బంగారం పండాలిసిన జీవితం...

పాడుచేసిందా...నిజంగా ఆలోచిస్తే...

అప్పుడు ఆలోచన...అతడు అంతకన్నా...అలా తాను...అన్నివేళలా అంటిపెట్టుకుని ఉంటే... బాగుపడలేడేమోననే ఆదుర్దాయేగాని...అంతకు మించిన...అన్నెమూ పున్నెమూ అలవరచుకొనగలిగిందా?

ఎవరిది దోషం...

అప్పట్లో...తనకు...ఎవరితోనూ ఊరువిడిచి ఉడాయించవలసిన అగత్యం ఎంతమా త్రమున్నూ లేదు:

మగడు... తగనివాడు కావడం...తనచేత...తనకొరకు ...తనకై...తల్లిదండ్రులు...వారి... వా...రి తల్లిదండ్రుల తరాల నోములకు ఓచని...తపస్సులే...బుస్‌మనగా...

అనగా...ఏం...ఒళ్ళు విరుచునేందుకు యింట మన సొగ్గనిదని...పోకిళ్లు పోబోతుందని... నోరూరించుకునే ఊరి మగరాయలకు...తనకూ...ఏమిపని?...ఎవరో ఒకరికి చిక్కక మిగిలితే... తనమనసే తనకు దక్కదనుకుని...గునిసే...కొత్తకోడలా?...

అనూ పాను...అలవోకగా...అలవాటుకు తలచూపకుండా...అమరి...అణగి...అన్ని నాళ్ళకు... అడజాడలకు బిడియపడే...ఆ పడుచువాని సిగ్గుపాటున...అలనాటి సంజెవాటున...అకలివిచ్చి... రెపరెపమన్న వేళ...

కోరికగా...నేర్చుకున్నది... తీరికకు తనైనాడు. అతను, ఎందుకిలా అయినాడు?

మొదట తాను కోరి చేసిన ఉపకారం చివరకి అతనికి అపకారం ఎందుచేత అయింది?

అందుకు ఏమిటి కారణం?

ఏరి కోరి వలచింది...ఏమీ తెలియని అర్భకునిచేత వలపించ నేర్పింది...తాను: ఔనా...అతనికోసమే...అంతవరకూ అవసరంలేని...త్యాగం...నిజంగా తన తలకు మించినపని...చేసింది: అతనిని తనవెంట లేవదీసుకుని...ఇంటిని విడిచివచ్చింది.

వేళా పాళా తెలుసుకో నక్కరలేకుండా యుగం అంత బ్రతుకు దీరు పోకుండా...నిమిషంలో గడపటం... ఏలాగో...గురువై తెలిపింది...తాను అతనికి బరువు తోచకముందే...సన్న తెలిసి... కన్నుమలగిపోయింది...

అతనికి అంతు తెలియని...దూరంలో...కటిక చీకటి కమ్మించుకుని...హాఁ...అతను ఎంతవాడో కావడానికి...తాను ఏమైతేనేం?

కాని...అనుకున్నది...ఏదీ కాలేదు.

మొదటి మోసం...తన మనసే–

నిన్ను మరచిపోతాడు...నీవు కనపడకపోతే కనపడవని...ఏమో వెతుక్కుంటూ... ఎక్కడికో...ఎక్కడికో. ..ఎక్కిపోతాడు...ముందుపడే అతని అడుగులకు నీవు సంకెల వెందుకౌతావు?...ఇక...అయినది చాలు...తప్పుకో అని దద్దరించినది...తానందుకు సరి అని తల ఊచింది...కాని...

ఆమీదటిమోసం...తనకు తానే...

తాను...ఎందుకు మరచిపోలేదు? పోలేకపోతేనేం?...అతను లేక బ్రతుకలేని అలసురాలా? అదివరకున్న బ్రతుకు...అదేకదా?...కాని...

అతన్ని మరువలేకపోయింది...అతనులేక ఉండలేనని తెలుసుకుని...మోసగించిన మనసును, తననూ మోసగించుకునేందుకు...ఎదురాటగా...అతన్ని పోగొట్టుకొన్న ఆరాటము ఒరపిడికి...మరొక ఆతడెవరైనా...

ఎవరైనా...ఎందరైపోయినా...ఆ ఉమ్మరంలో తనలోతాను దాక్కునేందుకే...

మరి...అతను?...ఎందు కలా అయిపోవాలి?... తాను చేసిన చేత వృథా? తనకు చేతకాలేదా? అతను–– ఎవరో అయి...ఏ ఎత్తునో నిలువకుండా...అతనే అయి...తనకుదక్కిన అతని నీడగా – ఎందు కీనాడూ మిగలాలి? తనకోసమేనా?...

ఆ ఊహకు ఎక్కి దక్కి అయిన జాలితో...అతని వంక చూసింది...అందుకోసమే ఊపిరి చివర నిలిచి ఉన్న అతని చూపులు...ఆశగా దీనంగా...హాయిగా...

అందులోనే...తుఫాను చెలరేగింది...తన పరాజయాన్ని అంగీకరించలేకపోయింది.. దిద్దినా...తీరని అతని పసితనాన్ని సహించలేకపోయింది...చూపుల్లో వెన్నెల చలువలు యిగిరి...నిప్పులు కళపెళలాడినవి... ముఖము త్రిప్పేసింది...

అవతల గుమ్మందగ్గర...అంతసేపునుంచి ...ఆమె కోసం కనిపెట్టుకుని ...అతడు... తిరిగి తనకే దక్కే దేవికి మనసుతో సాగిలపడి...మమతతో 'పాపం అతను ఏలా ఉన్నాడు'...అని ధైర్యంగా అడిగాడు: ఆమె విషంగా – 'పాపమే...అతనిలా ఉండటం: ఇక్కడ ఉండటం--లేవ సత్తువచ్చిన తరువాత – పడినపాటుకు ఏదో యింత యిచ్చి – పంపివేయమను – మన నౌకరును...అతను ఎవడో--పాపం...' అని అతడిని ఆశలునిండే చిరునవ్వుతో మురిపించి –– దొరసానిలాగా –– లోపలికి వెళ్ళిపోయింది.

★ ★ ★